# 65. జాతక కథ

సర్వేశ్వరరావని; వెనకెప్పుడో నాతోబాటు సర్వే డిపార్టుమెంట్‌లో పనిచేసేడు. అప్పట్లో సర్వే డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా ప్రమోషన్ ఇవ్వడానికి సర్వేయింగ్‌లో ఏదో ఒక కేటిగరీలో - అంటే సర్వేయర్‌గానో డిప్యూటీ సర్వేయర్ గానో హెడ్ సర్వేయర్ గానో - నియామకం పొందిన వాళ్లనుంచే ఏరుకొనేవారు. అంతేగాని గుమాస్తాలుగా చేరినవాళ్లు ఎంత సమర్థంగా, వినయంగా పనిచేసినా వాళ్లనుంచి ఆఫీసర్ పదవికి ఎవర్నీ ఎన్నిక చేసేవాళ్లు కాదు. అది అలావుండగా ఆఫీసు మేనేజరు పదవికి కూడా సర్వే కేటిగరీల్లోంచే ప్రమోషన్లు ఇచ్చేవారు. రెవెన్యూ డిపార్టుమెంటు, కమర్షియల్ టాక్స్‌ల డిపార్టుమెంట్ - ఇలాంటి వాట్లో గుమాస్తాలుగా చేరినవాళ్లు జిల్లా స్థాయి (ఆ మాటకొస్తే రాష్ట్ర స్థాయి) అధికారులుగా ప్రమోషన్లు పొందడం అప్పుడూ వుంది, ఇప్పుడూ వుంది.

సర్వేశ్వరరావు సర్వే డిపార్టుమెంట్‌లో చేరడానికి కొద్ది కాలానికి ముందర సర్వే డిపార్టుమెంట్‌లోని నాన్-సర్వే కేటిగరీల ఉద్యోగులు (ముఖ్యంగా గుమాస్తాలు) ఒకానొక శాంతియుతమైన ఉద్యమం ద్వారా ఈ తేడాని ప్రతిఘటించేరు. “మేం కూడా ఈ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నాం కదా, ఈ డిపార్టుమెంట్ ఉద్యోగులకి పెట్టే పరీక్షలకి మమ్మల్ని కూడా రాయనిస్తే ఏమీ?'' అన్నధోరణిలో ఆ ఉద్యమం ప్రారంభమైంది. ఆ మీమాంస రాష్ట్ర స్థాయి హెడ్డాఫీసు అయిన డైరెక్టరేట్‌లో కాగితాలమీద చర్చ కొచ్చినప్పుడు; ఆ ఆఫీసులో డిప్యూటీ డైరెక్టరు తప్ప మరొకరెవరూ సర్వే కేటిగరీలో పుట్టిన వాడు గాని పనిచేసిన వాడు గాని లేరు. దాంతో; “అవును, పరీక్షలు రాస్తామంటున్నారు, అంతేకద!'' అన్న ధోరణిలో ఆ నోటు అధికార్లకి వెళ్లి “సరే, రాసుకోండి!'' అనే ఆర్డర్ తెచ్చుకుంది.

అప్పట్లో ఒకనుడికారం వుండేది - “చదువురానివాడికి సర్వే” అని. ఆ నుడికారం ఉట్టి గుట్టినే ఏర్పడలేదు. సర్వేపని చేస్తానంటూ వచ్చిన నిరుద్యోగుల్లోంచి “వీడెవడో బి.ఏ. మేథమేటిక్స్‌లో ఫస్ట్‌క్లాసు తెచ్చుకున్నాడు. అంచేత యోగ్యుడయివుంటాడు'' అనుకుని ఎవర్నయినా ఉద్యోగానికి నియమిస్తే వాడు ఏడాది తిరక్కుండా (మరో నీడపట్టు ఉద్యోగం చూసుకుందికని) మానేసి వెళ్లిపోయేవాడు. అలా ఉత్తీర్ణతని బట్టి కాకుండా దేహదారుఢ్యం, దస్తూరీ లాంటివి చూసి నియమించుకున్నవాళ్లు (ఇంకోదారి లేక) సర్వేయర్లుగా ఉండిపోయేవారు. ఈ కన్సిడరేషను 1955లో నేను స్వయంగా చూసేను. నారాయణ గారని, ఒక ఆఫీసరు గారు సర్వేయర్లుగా నియమించడం కోసం కేండిడేట్లని పంపమని ఎంప్లాయిమెంట్ ఎక్స్‌ఛేంజికి వ్రాస్తూ “అర్హతలు” అన్నచోట “మెట్రిక్; లేదా ఎస్.ఎస్.(ఎల్)సి - పాస్; లేక ఫెయిల్ అయిన వారు'' అని వ్రాశారు. మొదటి బేచ్‌లో 50 మందిని సెలక్ట్ చేయాలి. ఎంప్లాయిమెంట్ ఎక్స్‌ఛేంజి వారు 90 మందిని పంపేరు. విడివిడిగా ఇంటర్వ్యూ చెయ్యాలంటే ఒక రోజు టైం చాలకనో లేక మరెందువల్లనో కాని; “మూకుమ్మడి ఇంటర్వ్యూ'' లాంటిది జరిపేరు.

“మీలో ఇంటర్మీడియట్‌గాని, ఆపైని గాని చదివిన వాళ్లంతా ఈ వేపుకు ఒచ్చీయండి.”

కలకలలాడే నవ్వు మొహాలతో ఒక డజను మంది “ఈ వేపుకి” ఒచ్చీసేరు.

"ఎస్సెల్సీగాని మెట్రిక్లేషను గాని పాసైనవాళ్లు ఆవేపుకి అలా వెళ్లండి".

మొహాల మీద నిరుత్సాహంతో నిరాశతో మధ్యని మిగిలిపోయిన ఇరవై ఆరుగురున్న గుంపులోంచి "ఎస్సెల్సీ, మెట్రిక్లేషనూ ఫెయిలయినాసరే ఫరవాలేదన్నారే!" అన్న గుసగుసలు.

"సైలెన్స్!" అన్నారు నారాయణగారు. మేనేజరుగారి వేపు చూసి, మధ్య గుంపు వేపు చూపించి "వీళ్లందరి చేతా ఒకటి నుంచి నూరుదాకా అంకెలు వేయించి; తెలుగులో చిన్న డిక్టేషన్ రాయించు" అన్నారు (ఒక గంట తరవాత వాళ్లలో ఇరవైనలుగురికి ఎపాయింట్మెంట్ ఆర్డర్లు ఇచ్చేరు.)

ఎస్సెస్సెల్సీ, మెట్రిక్లేషను పాసయిన వాళ్లని విడివిడిగా ఇంటర్ వ్యూ చేసి; వాళ్లలో స్థిరాస్తులున్న కుటుంబాల కుర్రాళ్లనీ, ఉద్యోగం లేకపోయినా తల్లో తండ్రో ఇంకా కొంతకాలం పోషిస్తారన్న ధీమా ఉన్నవాళ్ళనీ వదిలేసి ఆ గుంపులోంచి ఇరవై ఇద్దర్నీ సెలక్ట్ చేసేరు.

మిగిలిన నలభై నలుగుర్నీ ఒక్క గుంపుగా నిలబడమని; (తను కూడా నిలబడే వుండి) నారాయణగారు చెప్పిన మాటలు ఇవి: "అబ్బాయిలూ! మిమ్మల్ని సెలక్ట్ చెయ్యలేదని బాధపడకండి. మీ కందరికి సర్వేయర్లుగా కాక వేరే మంచి ఉద్యోగాలు వేగిరం దొరకాలని నేను ఆశీర్వదిస్తున్నాను. సర్వే ఉద్యోగం చాలా కష్టం. పల్లెటూళ్లలో వుండాలి. కరణంగారి అరుగు మీదనో మునసబుగారి వసారాలోనో ఆఖరికి రామ్మందిరంలోనో ఉండవలిసొస్తుంది. పల్లెటూళ్లలో హోటళ్లుండవు గనక వంట చేసుకోవలసొస్తుంది. మీరందరూ కూడా మేము సెలక్ట్ చేసిన వాళ్ళకన్నా చదువు అబ్బినవాళ్లు. కొంచెం ప్రయత్నిస్తే మీలో ప్రతి ఒక్కరికీ ఇంతకంటె మంచి ఉద్యోగాలు దొరుకుతాయి."

(ఒక ఇంటరెస్టింగ్ ఎపిసోడ్ చెప్పడంతో హరికథ పిట్టకథలోకి దూకినట్టుంది)

అటువంటి (చదువురాని) సర్వేయర్లకోసం ఉద్దేశించిన పరీక్షలు రాయడానికి అనుమతి తెచ్చుకున్న నాన్-సర్వే-కేటిగరీ ఉద్యోగులు ఆయా పరీక్షల్ని ఆయా సర్వేయర్ల కంటె సమర్థంగా తెలివిగా రాసి పారెయ్యడంతో, ఆఫీసుల్లో పనిచేస్తున్న వాళ్ళలో కూడా సాంకేతిక అర్హతలు సంపాదించుకున్నవాళ్లు ఎక్కువై, "మాకు పొలంమీద చేసే పనిలో ట్రెయినింగిచ్చి చూడండి; మా సామర్థ్యం మీకే బోధపడుతుంది!" అన్న ధోరణిలో మరో శాంతియుత ఉద్యమం వచ్చింది. అప్పటికి నేను హెడ్ సర్వేయరు. మా సర్వేశ్వర్రావు హెడ్ గుమాస్తా. అతన్ని ట్రెయినింగుకి నాదగ్గిరే వేశారు. ట్రెయినింగు తరువాత ప్రాక్టికల్ టెస్టుపెడితే అందులో కూడా చిక్కంలోంచి కిందికి రాలిపోకుండా తేలడంతో, నా దగ్గిర ట్రెయినింగయిన సర్వేశ్వర్రావు నాకు పై ఆఫీసర్గా ప్రమోషన్ తెచ్చేసుకున్నాడు. మేం అంతా లోపల్లోపల ఏడ్చుకున్నా పైకి మాత్రం -

"మొత్తానికి సర్వే-శ్వరరావన్న పేరు నిలబెట్టుకున్నారు సార్" అనీ.

"సర్వేజనా స్సుఖినోభవంతన్నారు గాని సర్వేశ్వర్రావు స్సుఖినోభవంతనవలసింది సార్" అనీ - మా మీదనో అతని మీదనో ఇదమిత్థంగా తెలియని జోకులు వేసుకున్నాం.

సర్వేశ్వర్రావు నా దగ్గిర ట్రెయినింగవుతున్న రోజుల్లో నేను జాతకాలు వెయ్యడం, మంచి

చెడ్డా చెప్పడం సాధన చేసేను. వూరికే, సరదాకే. అగ్రహారంలో మా పెదమామగారు దాచిన పాత పంచాంగాలూ, ఇంగ్లాండులో అచ్చువేసిన "ఇఫిమిరిస్"లూ దగ్గిర పెట్టుకుని; ఎవరైనా పుట్టిన స్థలం పుట్టిన తేదీ పుట్టిన సమయం సరిగ్గా చెప్పగలిగితే వాళ్లకి జరిగిన, జరగబోయే శుభ-అశుభాలను గణనం చేయడం సూచనాప్రాయంగా చెప్పడం "హాబీ"గా పెట్టుకున్నాను. స్థలం, తేదీ చెప్పగలిగినా కొందరు "సమయం" సరిగ్గా చెప్పలేకపోతే, "జరిగిన" ముఖ్య శుభాశుభాలను బట్టి "ఎఫిమిరిస్" సహాయంతో కరెక్టు టైము ఇంత అయ్యుండాలని లెక్కలు కట్టడం, దాన్ని బట్టి భవిష్యత్తు సూచించడం కూడా ఆ సాధనలో భాగమే.

ఓసారి నేను ఆ బిజీలో ఉండి సర్వేశ్వర్రావుకి పాఠం చెప్పడం వాయిదా వేస్తే "నువ్వు ఎస్ట్రాలజీ ప్రాక్టీస్ పెట్టి డ్యూటీ ఎగ్గొడుతున్నావని రిపోర్టు చేస్తాను." అన్నాడు. ఇదీ ఒక విద్యేనని అతన్ని ఒప్పించాలన్న పట్టుదలతో అతని జన్మ స్థలం, తేదీ, సమయం తెలుసుకొని అతనికి పితృవియోగం, మాతృవియోగం ఎప్పుడెప్పుడు సంభవించాయో, డిగ్రీ, వివాహం వంటి శుభాలు ఎప్పుడెప్పుడు ఒనగూడేయో లెక్కలుకట్టి చెప్పేను. "ఇవన్నీ నీ కిదివరకే తెలుసు. ఊరికే, లెక్కలు కట్టినట్టు నటించి చెప్తున్నావు, అంతే" అన్నాడు. మరి కొన్ని లెక్కలు కట్టి "మీకు నాలుగు నెలల్లో ధన సంబంధమైన ఉన్నతి" అన్నాను. "ధనం ఒకటేనా, అధికారం కూడానా?" అని అడిగాడు. మళ్లీ లెక్కలేసి " రెండూను" అన్నాను. "అరె, పోవయ్యా - ఇది నువ్వు చెప్పేదేంటి, ఈ ట్రెయినింగ్ అయిపోయిన వెంటనే మా బేచ్ అందరికీ ప్రమోషన్లు కదా!" అన్నాడు. "రెండేళ్లలో నీకు అత్యంత ఆప్తురాలయిన స్త్రీ వియోగం సంభవిస్తుంది." అని చెప్పేను. ఆ తరవాత, సరిగ్గా రెండేళ్లకి, అతని పినతల్లి మరణిస్తే: "నువ్వు ఆ రోజు చెప్పిన దాన్నిబట్టి మా ఆవిడకే మారకం అని భయపడి నీమీద చిరాకు పడ్డాను." అని గుర్తుచేస్తూ నొచ్చుకుంటూ ఉత్తరం రాసేడు. "ఏ పురుషుడయినా తనకు అత్యంత ఆప్తురాలయిన స్త్రీ తన భార్యే అనిపించడం గొప్పవిషయం" అని నా సముదాయింపు లేఖలో జవాబు ఇచ్చాను.

మాతో బాటు పనిచేసిన రమణమూర్తి వాళ్లమ్మాయిని సర్వేశ్వర్రావు కొడుక్కి చేసుకోమని అడిగాడట, అమ్మాయిదీ అబ్బాయిదీ జాతకాలు పట్టుకొచ్చి కుదురుతాయో లేదో చూడమన్నాడు సర్వేశ్వరరావు. పెళ్లి వ్యవహారం కదా అని నాకా విద్య నేర్పిన ఆంజనేయ శాస్త్రిగారి సహాయం కూడా తీసుకొని, దోషాలు ఏమీ లేవని చెప్పేను. మాటల సందర్భంలో రమణమూర్తి స్థితిగతులూ పాత అనుభవాలూ మాట్లాడుకున్నాం. సర్వేశ్వర్రావు ఆ రాత్రి మా ఇంట్లో ఉండి మర్నాడు వెళ్లాడు.

పదిహేను రోజుల తరవాత రమణమూర్తి వచ్చాడు. "సర్వేశ్వర్రావూ మనం పాతికేళ్లకి పైగా స్నేహితులం, సహాధ్యాయులం - కదా. మా అమ్మాయిని కోడలుగా చేసుకుని కడుపులో పెట్టు కుంటాడనుకున్నాను. జాతకాలు నప్పలేదని చెప్పేశాడు. అవునూ, జాతకాలు సరిచూసింది నువ్వేటగా?" అని నిష్ఠూరం ఆడేడు.

"మీ అమ్మాయి జాతకం నప్పింది, నీ జాతకమే నప్పలేదు. నువ్వు యాభైవేలయినా కట్నం ఇవ్వలేవు. నీకు నువ్వున్నది తప్పా వేరే ఇల్లులేదు. మీ అమ్మాయికి నెలకో రెండువేలు జీతం ఒచ్చే ఉద్యోగం లేదు." అన్నాను.

★